
ఆశలు రేకెత్తిస్తున్న పత్తి



నెన్నెలలో ఏపుగా పెరిగిన పత్తిపంట

● అనుకూలంగా వాతావరణం

● ఏపుగా పెరుగుతున్న పంట ● ఉత్సాహంగా సాగుపనులు

నెన్నెల, ఆగస్టు 27: పత్తి పంట రైతుల్లో ఆశలు రేకెత్తిస్తోంది. ఆరుతడి పంటైన పత్తికి అడపదడప కురుస్తున్న వర్షాలతో కాలం కలిసివస్తోంది. అదనులో విత్తనాలు పడటంతో పత్తి పంట 70 నుంచి 90 రోజుల వయసులో ఉంది. ఎలాంటి చీడపీడల బెడద లేకుండా ఏపుగా పెరుగుతూ గూడ కట్టి పూతకు వస్తోంది. ఇప్పటి వరకు పంట బాగుందని, పరిస్థితులు ఇలాగే కొనసాగితే పత్తిలో మంచి దిగుబడులు రావడంతో పాటు ఆశించిన ధర లభిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వాతావరణం అనుకూలిస్తుండటంతో ఉత్సాహంగా సస్యరక్షణ చర్యలు చేపడుతున్నారు.

పెరిగిన సాగు విస్తీర్ణం

జిల్లాలో వరి కంటే పత్తి పంటనే ఎక్కువ విస్తీర్ణంలో సాగవుతోంది. చేల తో పాటు మామిడి తోటల్లో అంతర పంటగా కూడా పత్తి పండిస్తున్నారు. ఇంటి పెరళ్లల్లో సైతం మక్కకు బదులు పత్తి వేస్తున్నారు. చాలా మంది రైతులు తమ సొంత చేలతో పాటు కౌలుకు భూములు తీసుకొని పత్తి సాగు చేస్తున్నారు. వరికి బదులు వాణిజ్య పంటైన పత్తిని ప్రోత్సహించాలనే ప్రభుత్వ నిర్ణయం మేరకు జిల్లాలో పత్తి పంట విస్తీర్ణం పెంచేందుకు అధికారులు కూడా కృషి చేశారు. పల్లెల్లో సదస్సులు ఏర్పాటు చేసి సాగు విస్తీర్ణం పెంచాలని ప్రచారం చేశారు. ఫలితంగా గతేడాది కంటే జిల్లాలో ఈ ఏడు మరో 30 వేల ఎకరాల్లో పత్తి సాగు విస్తీర్ణం పెరిగింది. సీజన్‌లో జిల్లాలో 1.80 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతోంది. గతేడాది ఆశించిన దిగుబడులు రావడం, పత్తికి మంచి ధర పలకడంతో రైతులు ఆసక్తి చూపించారు. ఈయేడు సైతం కేంద్ర ప్రభుత్వం పత్తికి మద్దతు ధరను క్వింటాలుకు రూ.501లు పెంచింది. రూ.7,020 నుంచి రూ.7,521లకు ధర పెరగడంతో రైతులు ఎక్కువ పత్తి సాగువైపు మొగ్గు చూపారు.

అనుకూలంగా వాతావరణం

ఆరుతడి పంటైన పత్తికి ప్రస్తుత వాతావరణం అనుకూలంగా ఉంది. అతి వృష్టి, అనావృష్టి కాకుండా అప్పుడప్పుడు వానలు కురుస్తుండటం పత్తి పంటకు కలిసి వస్తోంది. ఎక్కువ వర్షం వస్తే చేలు జాలు వారి మొక్కల పెరుగుదల ఉండదు. కలుపుతోపాటు చీడ పీడల బెడద అధికంగా ఉంటుంది. మోస్తరు వర్షాలతో చేలల్లో ప్రస్తుతం గుంటుకలు నడుస్తున్నాయి. చేలో గుంటుక సాగితే కలుపు నివారణలో రైతులకు 60శాతం ఖర్చు ఆదా అవుతుంది. దౌర కొట్టి సులువుగా కలుపు నివారించుకుంటున్నారు. పైపాటు ఎరువులు వేసుకొని, పూత నిలిచేందుకు మందులు పిచికారి చేస్తున్నారు. మొదటి రెండు నెలలు వాతావరణం అనుకూలిస్తే పత్తి పంటకు ఢోకా ఉండదని రైతులంటున్నారు. పొడి వాతావరణం ఉంటే చీడపీడలు కూడా అంతగా ఆశించవని చెబుతున్నారు. ప్రస్తుతం పనులన్ని అదనులోగా పూర్తవుతున్నాయని రైతులు పేర్కొన్నారు. వాతావరణం అనుకూలంగా ఉండటంతో, చీడపీడల నుంచి పంటను రక్షించుకుంటే దిగుబడులు చేతికి వస్తాయని రైతులు ఆశిస్తున్నారు.

కాలం కలిసివస్తోంది: గాజు మహేందర్, మన్నెగూడం



ప్రస్తుత వాతావరణం పత్తి పంటకు అనుకూలంగా ఉంది. మోస్తరు వర్షాలు కురుస్తుండటంతో పత్తి చేలల్లో పనులు సజావుగా సాగుతున్నాయి. 20 ఎకరాల్లో జూన్ రెండో వారంలోనే విత్తనాలు వేశా. పంట ఏపుగా పెరిగి గూడ కట్టి పూతకు వస్తోంది. అధిక వర్షాలు ఉంటే కలుపు బెడద అధికంగా ఉంటుంది. కాని అడపాదడపా వర్షాలతో ఈ సారి అంతగా కలుపు లేదు. పొడి వాతావరణంతో గుంటకలు నడుస్తున్నాయి. చెట్లు పెరిగి సాళ్లు కలిసిపోతే కలుపు రాదు. ఇప్పటి వరకు ఎలాంటి చీడపీడల బెడద లేకుండా పంట ఆశాజనకంగా ఉంది.

పత్తి సాగుపై అవగాహన

హాజీపూర్: గుడిపేట రైతువేదికలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సలహాలు, సూచనలు అందించారు. ప్రస్తుతం పత్తిలో రసం పీల్చే పురుగులు వచ్చే అవకాశం ఉందని, దీని నివారణకు ఎసిపేట్ 300 గ్రాములు ఎకరానికి లేదా ఇమిడాక్లోప్రిడ్ 60 మిల్లీలీటర్లు ఎకరానికి స్ప్రే చేయాలన్నారు. వరిలో బ్యాక్టీరియా, ఆకు ఎండు తెగులు, అగ్గి తెగులు వచ్చే అవకాశం ఉన్నందున నత్రజని ఎరువులను తక్కువ మోతాదులో వాడాలని సూచించారు. అనంతరం మండల వ్యవసాయాధికారి కృష్ణ మాట్లాడుతూ ప్రతీ మంగళవారం గుడిపేట రైతువేదికలో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ సస్యరక్షణ చర్యలు వివరిస్తామని, రైతులు పాల్గొనాలని కోరారు.

ఖర్గేను కలిసిన ఎమ్మెల్యే



బెల్లంపల్లి, ఆగస్టు 27: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను మంగళవారం ఢిల్లీలోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ దంపతులు కలిశారు. కేబినెట్ విస్తరణ జరగనున్న నేపథ్యంలో మంత్రి పదవి కోసం ఖర్గేను కలిసినట్లు తెలుస్తోంది.

అధికారులను కలిసిన రేషన్‌డీలర్ల సంఘం నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 27: జిల్లాకు వచ్చిన జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, ఎఎస్‌వో వేణుగోపాల్, డీటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పోచన్న, అంజయ్యలను మంగళవారం రేషన్ డీలర్ల సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. వారికి పుష్పగుచ్చాలు అందించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మోటపలుకుల సత్తయ్య, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, మహేందర్, తిరుపతి, బానేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ అప్లికేషన్ల పరిశీలన

భీమారం, ఆగస్టు 27: రానున్న పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఓటరు లిస్టుతో పాటు ప్రజాపాలన అప్లికేషన్ల ఆన్‌లైన్ నమోదును మంగళవారం ఎంపీడీవో సత్యనారాయణగౌడ్ పరిశీలించారు. ఎంపీడీవో కార్యాలయంలో జరుగుతున్న ఆన్‌లైన్ నమోదును పరిశీలించి సూచనలు చేశారు.

రేపు ఉద్యోగులకు క్రీడా పోటీలు

ఏసీసీ, ఆగస్టు 27: జాతీయ క్రీడల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 29న జిల్లాలోని ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారిని కీర్తిరాజ్‌వీరు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రన్నింగ్, లెమన్ స్పూన్, చెస్, మ్యూజికల్ చైర్, టగ్ ఆఫ్ వార్, షాట్ పుట్ తదితర క్రీడలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల ఉద్యోగులు బుధవారం 9963039234లో పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

రేపు జాబ్ మేళా

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 27: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 29న ఉదయం 11 గంటలకు ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించేందుకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మాసిస్టు, ట్రైనింగ్ ఫార్మాసిస్టు, అసిస్టెంట్ ఫార్మసీ పోస్టులు ఉన్నాయని తెలిపారు. ఇంటర్, డిగ్రీ, డీ ఫార్మసీ, బీ ఫార్మసీ చేసిన వారు అర్హులన్నారు. వివరాలకు 9110368501, 9963452486లో సంప్రదించాలన్నారు.

ఎన్‌హెచ్-63 అలైన్‌మెంట్‌ను మార్చాలి

ఆర్డీవో కార్యాలయం ఎదుట రైతుల నిరసన ● రైతులకు నోటీసులు ఇచ్చిన అధికారులు ● వాటిని కాల్చివేసిన రైతులు



ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

ఏసీసీ, ఆగస్టు 27: నేషనల్ హైవే 63 విస్తరణలో భాగంగా రూపొందించిన మూడో అలైన్‌మెంట్‌ను మార్చాలని లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల రైతులు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం రైతులకు రెవెన్యూ అధికారులు ఇచ్చిన నోటీసులను కాల్చివేసి రెవెన్యూ అధికారుల వైఖరిని నిరసిస్తూ నినాదాలు చేశారు. రైతులు మాట్లాడుతూ నేషనల్ హైవే 63 విస్తరించే ప్రతిపాదనలో భాగంగా 2018, 2023లో అధికారులు రెండు అలైన్‌మెంట్లను రూపొందించారన్నారు. కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు భూస్వాములతో కుమ్మక్కై రెండు అలైన్‌మెంట్లు కాకుండా 2024లో కొత్తగా మూడో అలైన్‌మెంట్ రూపొందించారన్నారు. లక్సెట్టిపేట పట్టణ బైపాస్‌ను సాకుగా చూపి అంతకు ముందు ఉన్న అలైన్‌మెంట్‌లను పూర్తిగా మార్చారన్నారు. కొత్తగా రూపొందించిన అలైన్‌మెంట్ వల్ల లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల్లో 500 మంది రైతులకు చెందిన 1400 ఎకరాల భూమి హైవే కింద పోతుందన్నారు. దీని వల్ల ప్రభుత్వంపై అదనంగా రూ.1500 కోట్ల భారం పడుతుందన్నారు. మూడో అలైన్ మెంట్‌ను రైతులు వ్యతిరేకించినప్పటికి రెవెన్యూ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ బలవంతంగా నోటీసులు అంటగడుతూ బ్యాంకు ఖాతా నెంబర్లు చెప్పాలని, భూములకు సంబంధించిన డబ్బులు జమ చేస్తామని ఒత్తిడి చేస్తున్నారన్నారు. ఇప్పటికే తాము ఢిల్లీల్లో నేషనల్ హైవే అథారిటీ ఉన్నతాధికారులను కలిసి సమస్య వివరించామని వారు పీడీని పంపి విచారిస్తామని తెలిపారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు కూడా రైతులకు నష్టం కలుగ నివ్వనని హామీ ఇచ్చారని అయినప్పటికీ రెవెన్యూ అధికారులు రైతుల భూములను లాక్కునేందుకు పావులు కదుపుతున్నారన్నారు. ఇప్పటికే ఎల్లంపల్లి ప్రాజెక్టులో భూములు పోయాయని, ఒక ప్రాజెక్టులో భూములు కోల్పోయిన వారి మిగులు భూములను మళ్లీ సేకరించడం సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధమన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందించారు. రైతులు గుర్రాల శశిధర్‌రెడ్డి, అల్లి పరమేష్, జనార్దన్‌రెడ్డి, రాయమల్లు, ఒడ్నాల శ్యాంసుందర్, మల్లేష్, గొల్లపల్లి మేఘన, కస్తూరి మల్లేష్, మహేష్, తిరుపతి, సురేష్ పాల్గొన్నారు.



ఆర్డీవో కార్యాలయం ఎదుట నోటీసు ప్రతుల దహనం

కార్పొరేట్ స్థాయి విద్య అందించడమే లక్ష్యం





రెబ్బనపల్లిలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ స్థలంపై అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, మంచిర్యాలలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

దండేపల్లి, ఆగస్టు 27: ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. మంగళవారం లింగాపూర్ ఆదర్శ పాఠశాల, దండేపల్లి ప్రభుత్వ కళాశాల, రెబ్బనపల్లి ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవనాల నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. ఆదర్శ పాఠశాలలో హాస్టల్ లేకపోవడంతో స్కూల్‌కు వచ్చి పోవడంలో ఇబ్బందులు పడుతున్నామని, తాగునీటి సౌకర్యం, వాష్ రూమ్స్ సరిగా లేవని, కిచెన్ షెడ్డు, ప్లేగ్రౌండ్ నిర్మించాలని విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకవచ్చారు. హాస్టల్ నిర్మాణ పనులను పూర్తి చేసి ఉపయోగంలోకి తీసుకవచ్చే విధంగా కృషి చేస్తానన్నారు. దండేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న జూనియర్ కళాశాలకు పక్కా భవన నిర్మాణం చేపట్టే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మైదానంలో నిలిచిన వర్షం నీటిని తొలగించాలని అధికారులను ఆదేశించారు. రెబ్బనపల్లిలో నిర్మించ తలపెట్టిన ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవన నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతి, అదనపు కలెక్టర్ మోతీలాల్, ఆర్డీవో రాములు, డీఈవో యాదయ్య, డీపీవో వెంకటేశ్వర్‌రావు, డీఐఈవో అంజయ్య, డీఎంహెచ్‌వో హరీష్, తహసీల్దార్ సంధ్యరాణి, ఎంపీడీవో ప్రసాద్, ఎంఈవో రవీందర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

హాజీపూర్: మండలంలోని పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు పరిశీలించారు. గుడిపేటలో నిర్మిస్తున్న మెడికల్ కళాశాల నిర్మాణ పనులను నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. దొనబండలో నిర్మించే విద్యుత్ సబ్‌స్టేషన్‌కు స్థలాన్ని పరిశీలించారు. అదనపు కలెక్టర్ మోతిలాల్, ఆర్డీవో రాములు, విద్యుత్ ఏఈ మహేందర్, తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే ఉన్నారు.

ఏసీసీ: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాసంక్షేమానికి నిరంతరం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. ఏసీసీ సబ్‌స్టేషన్‌లో 12.5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌పార్మర్‌ను అదనపు కలెక్టర్ మోతిలాల్, ఆర్డీవో రాములుతో కలిసి ప్రారంభించారు. విద్యుత్ శాఖ అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

లక్సెట్టిపేటరూరల్: పనులు నాణ్యతతో చేపట్టాలని ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు అన్నారు. పట్టణంలో నిర్మిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి భవనంతోపాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల పనులను పరిశీలించారు. ఆసుపత్రిలో కావాల్సిన పరికరాలు అవసరం ఉంటే తనకు తెలియజేయాలని, జనరేటర్ అందుబాటులో ఉంచాలని ఎమ్మెల్యే సూచించారు. డీసీహెచ్‌ఎస్ కోటేశ్వర్,డీఈ రాజ్‌కుమార్,ఏఈమోబిన్, ఎంఈవో రవీందర్, డీఐవో అంజయ్య, ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌రావు, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ ఆరీఫ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

జిల్లాలో హైడ్రాను అమలు చేయాలి



ఏవోకు వినతి పత్రం ఇస్తున్న మానవ హక్కుల కమిటీ నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 27: ప్రభుత్వం హైద్రాబాద్‌లో చేపట్టిన హైడ్రా కార్యక్రమాన్ని జిల్లాలో అమలు చేయాలని మంగళవారం జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీపతి రాములు కలెక్టరేట్ కార్యాలయం ఏవోకు వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు కబ్జాకు గురయ్యాయన్నారు. వీటిని కాపాడాలంటే హైడ్రాను జిల్లాలో విస్తరించాలని కోరారు. రాజేష్ యాదవ్, రాజేష్, రవి, సమ్మయ్య, సతీష్, గురునాధం, నరేందర్‌గౌడ్, శ్రీధర్, నరేందర్, స్వామి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నేతల సంబరాలు



మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావుకు స్వీట్ తినిపిస్తున్న నాయకులు

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 27: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విషయంలో ఎవరెన్ని కుట్రలు చేసినా న్యాయమే గెలిచిందని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు అన్నారు. మంగళవారం ఆమెకు బెయిల్ రాగా జైలు నుంచి విడుదల కావడంతో దివాకర్ నివాసం ఆవరణలో బీఆర్‌ఎస్ నేతలు మిఠాయిలు తినిపించుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. దివాకర్‌రావు మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్ కుట్రలో భాగంగా కవితపై అక్రమ కేసును బనాయించి అరెస్టు చేశారని, ఈ కేసులో ఎంతో మందిని విచారించినా నిర్ధారణ కాకపోవడంతో బెయిల్ వచ్చిందన్నారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గాదే సత్యం, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అంకం నరేష్, నాయకులు విజిత్‌రావు, శ్రీరాముల మల్లేష్, రవీందర్ రెడ్డి, తాజొద్దీన్ పాల్గొన్నారు.

బెల్లంపల్లి: బీఆర్‌ఎస్ నాయకురాలు కవితకు లిక్కర్ కేసులో సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం రాత్రి బీఆర్‌ఎస్ నాయకులు బెల్లంపల్లి పట్టణంలో సంబరాలు నిర్వహించారు. టపాసులు పేల్చారు. కార్యక్రమంలో నాయకులు బత్తుల సుదర్శన్, బడికెల శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

పీఎం జన్మన్ కార్యక్రమం

జన్నారం, ఆగస్టు 27: ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఏటీడీవో ట్రైబల్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో పీఎం జన్మన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వరద బాధితుల కాలనీ పుట్టిగూడ గ్రామాలకు చెందిన గిరిజనులు గతంలో దరఖాస్తు చేసుకున్నా సర్టిఫికెట్లు ఇప్పటికి రాలేదని ప్రశ్నించగా ఇప్పుడు అప్రూవల్ అవుతాయని డీటీడీవో గంగారం తెలిపారు. డీటీడీవో మాట్లాడుతూ తోటి, కొలాంల సంక్షేమం కోసం పీఎం జన్మన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి, ఎంపీడీవో శశికళ, ఆర్ఐ బానుచందర్, ఎంపీవో జలందర్ ఉన్నారు.

పాఠశాల ఎదుట పీడీఎస్‌యూ ధర్నా

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 27: విద్యాసంస్థల అవినీతిపై సీబీఐ, ఈడీతో విచారణ జరిపించాలని మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాల ఎదుట పీడీఎస్‌యూ నాయకులు ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థుల నుంచి లక్షల రూపాయల ఫీజులను వసూలు చేస్తూ కనీస సదుపాయాలు కల్పించడం లేదన్నారు. గతంలో అనేకసార్లు విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. అర్హత గల టీచర్లు, స్టాఫ్ లేరని, గ్రౌండ్‌లు లేవని పేర్కొన్నారు. రెడ్డి చరణ్, రాహుల్, రాహుల్, తిరుపతి, మహేష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిపై ఆరోపణలు అవాస్తవం

హాజీపూర్, ఆగస్టు 27: బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌పై అధికార పార్టీ నాయకులు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని బీజేపీ మండల ఉపాధ్యక్షుడు గడ్డం స్వామిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎనగందుల కృష్ణమూర్తిలు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్‌హెచ్ 63 గ్రీన్ ఫీల్డ్ హైవే విస్తరణలో బీజేపీ జిల్లా అధ్యక్షుడిపై తప్పుడు ప్రకటనలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే కేంద్ర ప్రభుత్వం వద్దకు వెళ్లి అలైన్‌మెంట్ మార్చాలన్నారు. కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు వెంకటరమణరావు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అశ్విన్‌రెడ్డి, నాయకులు మల్లేష్, ప్రశాంత్, రాజనర్సు, ధర్మయ్యవెంకట్‌రెడ్డి, పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

బెల్లంపల్లి, ఆగస్టు 27 : వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, కమిషనర్‌తో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో డెంగ్యూ, మలేరియా, ఇతర వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వార్డుల్లో బ్లీచింగ్ పౌడర్ స్ప్రే చేయించాలని, నీరు నిల్వ ఉన్న చోట ఆయిల్‌బాల్స్ వేయించాలని, పారిశుధ్య పనులను నిర్వహించాలని సూచించారు.

ఇండ్లలోకి చేరిన నీరు తొలగింపు

రెండు రోజుల క్రితం ఇండ్లలోకి చేరిన వరద నీటిని మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, కౌన్సిలర్ నెల్లి శ్రీలతరమేష్‌లు పారిశుధ్య కార్మికులతో తొలగించారు. ఇండ్లలో బ్లీచింగ్ పౌడర్, ఫెనాయిల్ చల్లించారు. నీట మునిగిన బాధిత కుటుంబాలను కౌన్సిలర్ భవానీ ఫంక్షన్‌హాలులో పునరావసం కల్పించి భోజనం, అల్పాహారం అందించారు. వాకర్స్ అసోసియేషన్ సభ్యులు మధ్యాహ్న భోజనం అందించారు. వాసవీ క్లబ్ సభ్యులు బాధిత కుటుంబానికి 10 కిలోల బియ్యం, సరుకులు అందజేశారు.

ఏజెన్సీ బంద్ విజయవంతం



దండేపల్లిలో రాస్తారోకో చేస్తున్న ఆదివాసి గిరిజన సంఘాల నాయకులు

కాసిపేట, ఆగస్టు 27: ఏజెన్సీ ప్రాంత సమస్యలను పరిష్కరించాలని, ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలని మంగళవారం చేపట్టిన ఏజెన్సీ బంద్ పిలుపు మండలంలో విజయవంతమైంది. నాయకపోడ్ సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి కొమ్ముల బాపు మాట్లాడుతూ ప్రభుత్వం వలస లంబాడీలను ఎస్టీ జాబితాలో నుంచి వెంటనే తొలగించాలని, జీవో నెంబర్ 3ని కొనసాగించి ఐటీడీఏలో ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ పోలీసు బెటాలియన్ ఏర్పాటు చేయాలని కోరారు. బంద్‌కు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఆదివాసీ సంఘాల నాయకులు ఆత్రం జంగు, సంద్ర భూమయ్య, సిడాం శంకర్, మడావి తరుణ్, రజనీ, ఆత్రం వంశీ, సిడాం హన్మంతు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి: ఎస్టీ జాబితాలో నుంచి లంబాడీలను తొలగించాలని ఆదివాసి గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బంద్‌లో భాగంగా దండేపల్లి, ముత్యంపేటలో ఆదివాసి సంఘాల నాయకులు రాస్తారోకో చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ ఆదివాసిలకు అడుగడుగునా అన్యాయం జరుగుతుందన్నారు. పోడుభూములతో పాటు ఆదివాసిలు తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాయిసెంటర్ జిల్లా, మండల అధ్యక్షులు పెంద్రం రాముపటేల్, శ్రీనివాస్, తుడుం దెబ్బ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి సోయం జంగు, మండల అధ్యక్షుడు కనక జంగు, సంఘం నాయకులు బాపు, సోము, కాంతరావు, ఎల్లయ్య, దాము, భీమరావు, వెంకటేష్, హన్మంత్, రాజేష్, రమేష్, పాల్గొన్నారు.

మాజీ ప్రజాప్రతినిధులకు సన్మానం

జన్నారం, ఆగస్టు 27: పదవీ కాలం ముగిసిన మాజీ ప్రజాప్రతినిధులను మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. మాజీ జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ మాదాడి సరోజనరవీందర్‌రావు, మాజీ వైస్‌ఎంపీపీ సుతారి వినయ్‌తో పాటు మాజీ సర్పంచులు, ఎంపీటీసీలను సన్మానించారు. ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అవార్డులు అందుకున్న తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఎఫ్ఆర్వో హఫీజుద్దీన్‌లను సన్మానించారు. సంఘం మండల అధ్యక్షుడు కాశెట్టి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, శంకరయ్య, మల్లయ్య, రాజన్న, రాములు, నర్సయ్య పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ఎక్కాహం

బెల్లంపల్లి(తాండూర్), ఆగస్టు 27: వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం రాత్రి ఎక్కాహం నిర్వహించారు. మంగళవారం ఆదిలక్ష్మీ, అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామి పల్లకి సేవ నిర్వహించారు. భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా అనగాష్టమి వ్రతం

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 27 : జిల్లా కేంద్రంలోని గోదావరి తీరంలో గల గౌతమేశ్వర ఆలయంలో మంగళవారం అనగాష్టమి వ్రతాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అవధూత దత్తపీఠం దత్త భక్తుల ఆధ్వర్యంలో పేద బ్రాహ్మణుడు వేణుగోపాల శర్మ దాదాపు 200 మంది భక్తులచే అనగాష్టమి వ్రతాన్ని చేయించారు. ఈ కార్యక్రమంలో గౌతమేశ్వర ఆలయ ఫౌండర్ శ్రీదేవి, ఆలయ కమిటీ సభ్యులు పడకంటి శ్రీనివాస్, కేశెట్టి వంశీకృష్ణ, నకిరేకొమ్ముల రాజేంద్ర ప్రసాద్, దత్త భక్తులు రాజు, రమేష్, సాయి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

సిర్పూరు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

బెల్లంపల్లి(తాండూర్), ఆగస్టు 27 : రాంనగర్‌లోని శివకేశవాల యంలో మంగళవారం సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు ఎమ్మెల్యే తీర్థ ప్రసాదాలను అందజేశారు నాయకులు చిలువేరు శేషగిరి, పులగం తిరుపతి పాల్గొన్నారు.

ఘనంగా తీజ్ ఉత్సవాలు



లింగాపూర్‌లో బుట్టలతో ర్యాలీగా వస్తున్న యువతులు

లక్షెట్టిపేటరూరల్, ఆగస్టు 27 : పట్టణంలోని సత్యసాయినగర్, లంబాడితండాలో తీజ్ ఉత్సవాలను మంగళవారం లంబాడీలు ఘనంగా నిర్వహించారు. సంత్ సేవాలాల్, జగదాంబ అమ్మవార్లకు ఉపవాసాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కౌన్సిలర్ సురేష్ నాయక్, కుల పెద్దలు తారాచంద్, రవీందర్, తిరుపతి, శ్రీనివాస్, రవి , మహిళలు పాల్గొన్నారు.

దండేపల్లి: లింగాపూర్‌లో తీజ్ వేడుకలను వైభవంగా నిర్వహించారు. గ్రామంలో ఊరేగింపుతో ఆటాపాట నృత్యాలు చేశారు. గ్రామ శివారులో గుండం వద్ద బుట్టలు పెట్టి ప్రత్యేక పూజలతో బంజార యువతులు, మహిళలు తీజ్ ఉత్సవ వేడుకలను నిర్వహించారు.

జన్నారం: కొత్తపేటలో తీజ్ ఉత్సవాలను నిర్వహించారు. సంత్ సేవాలాల్, జగదాంబ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. మహిళ లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామ పెద్దలు దినేష్ నాయక్, జాదవ్ తిరుపతి, మాలోత్ కాశీరాం, జైవంతరావు పాల్గొన్నారు.

అర్హులైన రైతులందరికి రుణమాఫీ వర్తింపజేస్తాం

మందమర్రిరూరల్, ఆగస్టు 27 : అర్హులైన రైతులందరికి రుణమాఫీ అవుతుందని చెన్నూరు వ్యవసాయ సహాయ సంచాలకులు బానోత్ ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం సండ్రోన్‌పల్లిలోని రైతువేదికలో నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమంలో మాట్లాడారు. మందమర్రి మండల పరిధిలో 400 మంది రైతులకు రుణమాఫీ కాలేదని వారందరికి వ్యవసాయాధికారులు ప్రత్యేక యాప్‌లో రుణమాఫీ కానీ రైతుల వివరాలు నమోదు చేస్తారని తెలిపారు. అలాగే రైతులకు పంటల విషయంలో ఏమైనా సందేహాలుంటే వ్యవసాయాధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఎలాంటి అనుమానాలు ఉన్నా అధికారులను కలిసి వివరాలు తెలుసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏవో కిరణ్మయి, ఏఈవోలు ముత్యం తిరుపతి, కనకరాజు, రైతులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూటీఎస్ జిల్లా శాఖలో పలువురికి చోటు

దండేపల్లి,ఆగస్టు 27: పీఆర్‌టీయూటీఎస్ జిల్లా కార్యవర్గంలో మండలానికి చెందిన పలువురు ఉపాధ్యాయులకు చోటు కల్పించినట్లు సంఘం మండల అధ్యక్షకార్యదర్శు రావనవేని రవి, మల్యాల మల్లేష్‌లు తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షులుగా కర్నె నరేందర్, దుర్గం మహేశ్వర్, మల్లూరి వినోద్, జిల్లా కార్యదర్శులుగా తనుగుల రాజమౌళి, లగిశెట్టి సురేందర్, ఎండి గఫూర్, రాజకొండ శ్రీనివాస్, ఎండి షరీఫోద్దీన్, ఇల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ఆవుల నరసింహులను ఎన్నుకున్నట్లు వారు వెల్లడించారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

దండేపల్లి,ఆగస్టు 27: వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కన్నెపల్లి గ్రామంలో కళాకారులు కళాజాత నిర్వహించారు. స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో ప్రజలందరు భాగస్వాములై గ్రామాలను పరిశుభ్రతగా ఉంచుకునే విధంగా కృషి చేయాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. జ్వరం వస్తే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని కళాకారులు ఆటాపాటలతో ప్రజలకు వివరించారు. టీం లీడర్ రమేష్, కళాకారులు ముల్కల్ల మురళీ, పోషం, శ్రీనివాస్, కిష్టయ్య, సత్యనారాయణ, కృష్ణ, రవీందర్, నాగలక్ష్మి, సంధ్య, పాల్గొన్నారు.

స్కీంల పేరుతో మోసం

బెల్లంపల్లి, ఆగస్టు 27: పట్టణంలోని కాల్‌టెక్స్ ఏరియాలో లక్కీడ్రా స్కీంల పేరుతో మోసగించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రెండు, మూడేండ్లుగా జై గణేష్ ఎంటర్‌ప్రైజెస్ పేరుతో నిర్మల్ జిల్లాకు చెందిన ఓ మహిళ కాల్‌టెక్స్‌లో ఓ గదిని అద్దెకు తీసుకుని లక్కీ స్కీంలను ఏర్పాటు చేసింది. నెలకు రూ.650 చొప్పున ఒక్కొక్కరు 20 నెలలు కట్టాలని, ప్రతి నెల డ్రా పద్ధతిన బహుమతులు అందజేస్తామని ఏజెంట్ల ద్వారా ప్రచారం చేసింది. కొందరు మహిళలు స్కీంలో చేరి రూ.650 చొప్పున రెం డు, మూడేండ్లుగా చెల్లిస్తున్నారు. మొదట నాలుగు నెలలు సభ్యులకు బహుమతులు అందజేసింది. దాదాపు వెయ్యి మందికి పైగా మహిళలు ఈ సభ్యులుగా చేరి నెలకు రూ.650 చొప్పున చెల్లిస్తున్నారు. కొన్ని నెలలుగా స్కీం నిర్వాహకురాలు ఫోన్ స్విచాఫ్ కావడం, ఏజెంట్లు స్పందించక పోవడంతో అనుమానం వచ్చి మోసపోయినట్లు గ్రహించారు. దాదాపు రూ. 4 కోట్లకు పైగా వసూలు పరారైనట్లు తెలిసింది. ఈ విషయంపై టూటౌన్ ఎస్‌ఐ మహేందర్‌ను వివరణ కోరగా స్కీంల పేరుతో మోసపోయినట్లు ఎవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

చీటింగ్ కేసులో జైలు శిక్ష

బెల్లంపల్లి, ఆగస్టు 27: చీటింగ్ కేసులో ఇద్దరు వ్యక్తులకు బెల్లంపల్లి కోర్టు జడ్జి ముకేష్ మంగళవారం రెండేళ్ళ జైలు శిక్ష విధించినట్లు వన్‌టౌన్ హెచ్‌వో దేవయ్య తెలిపారు. బెల్లంపల్లి వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2013 మార్చి 8న ఇద్దరు అన్నదమ్ములు ఒకరి స్థానంలో మరొకరు ఇంటర్ పరీక్ష రాయగా పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ సృజన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌ఐ స్వామి కేసు నమోదు చేశారని తెలిపారు. ఈ కేసులో 12 మంది సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో నిందితులు ఎంబడి మల్లేష్, ఎంబడి రాజేందర్‌లకు 2 సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పునిచ్చినట్లు తెలిపారు.

పత్తి పంట ధ్వంసంపై పోలీసులకు ఫిర్యాదు

కోటపల్లి, ఆగస్టు 27 : వెల్మపల్లిలో ఐత సత్తిరెడ్డి చేనులో పత్తి పంట ధ్వంసంపై మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సర్వే నెంబరు 152లో గల 35 గుంటల విస్తీర్ణంలో కొన్నేళ్ళుగా సాగు చేస్తున్నాడు. సోద రుడు ఐత బాపురెడ్డి, అతని కుమారుడు ఐత రాజేష్‌లు పత్తి పంటలను ధ్వంసం చేశాడని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సుమారు రూ. 50 వేల నష్టం జరిగిందని, న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజేందర్ పేర్కొన్నారు.

యువతి ఆత్మహత్య

శ్రీరాంపూర్, ఆగస్టు 27 : కృష్ణకాలనీకి చెందిన ఆకుల శిరీష(20) అనే యువతి ఆర్థిక సమస్యలతో మంగళవారం మధ్యాహ్నం ఆత్మహత్య చేసుకుంది. శిరీష డిగ్రీ చదువుకొని హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తోంది. రెండు రోజుల క్రితం ఇంటికి వచ్చింది. మధ్యాహ్నం తల్లి లక్ష్మీ కూలీ పనులకు వెళ్లిన సమయంలో ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సంతోష్ తెలిపారు.

అదుపు తప్పి ఆటో బోల్తా

బెల్లంపల్లి, ఆగస్టు 27 : చర్లపల్లికి వెళ్లే దారిలో మంగళవారం ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. మందమర్రి నుంచి రాజేందర్ అనే ఆటో డ్రైవర్ ప్రయాణీకులను ఎక్కించుకుని కన్నెపల్లి వెళ్తుండగా చర్లపల్లి సమీపంలోకి రాగానే అదుపు తప్పి ఆటో బోల్తా పడడంతో ఆటోలో ప్రయా ణిస్తున్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. డ్రైవర్‌కు గాయాలు కాకపోవ డంతో అదే ఆటోలో గాయాపాలైన ఇద్దరిని ఆసుపత్రికి తీసుకువెళ్లాడు.

కేకే ఓసీపీలో కొండ చిలువ కలకలం

మందమర్రిటౌన్, ఆగస్టు 27: మందమర్రి ఏరియాలోని కేకే ఓసీపీలో మంగళవారం 9 అడుగుల కొండ చిలువ కలకలం రేపింది. కార్మికుల పని ప్రదేశాల్లోకి కొండచిలువ రాగా కార్మికులు ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. అధికారులు స్నేక్ క్యాచర్ మహేందర్ కొండ చిలువను పట్టుకుని కాసిపేట అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. ఫారెస్టు అధికారులు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరం

నెన్నెల, ఆగస్టు 27: డయాసిస్ ఆఫ్ హ్యూమన్ ప్రమోషన్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. పీవీఆర్‌ఐ నేత్ర వైద్యశాల నిపుణులు 80 మందికి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మంచిర్యాల వరలక్ష్మి ఆప్టికల్స్ ఉచితంగా అద్దాలు అందజేశారు. వెంకటస్వామి, టెక్నీషియన్లు పల్లవి, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి



చెన్నూరులో ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు, కలెక్టరేట్ ఏవోకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

చెన్నూరు, ఆగస్టు 27: ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రుణమాఫీ చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్ పేర్కొన్నారు. చెన్నూరు పాత బస్టాండ్ వద్ద మంగళవారం ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు రుణమాఫీ పథకం చాలా మందికి అందలేదన్నారు. ఎన్నికల ముందు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పిన రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక ఆంక్షలు పెడుతూ రైతులకు రుణమాఫీ చేయడం లేదన్నారు. ఇప్పటివరకు కనీసం 20 శాతం రైతులకు కూడా రూ.2 లక్షల లోపు రుణమాఫీ అందలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. బీజేపీ పట్టణాధ్యక్షుడు జాడి తిరుపతి, పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శులు వెంకటనర్సయ్య, శ్రీపాల్, శంకర్, రామయ్య, శంకర్, శ్రీనివాస్, బాపు, సంజయ్, దీక్షితులు, కోటపల్లి, భీమారం, జైపూర్, మందమర్రి మండలాల బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మంచిర్యాల కలెక్టరేట్: ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, రాష్ట్ర రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాజేశం, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు దేవవరంలు పేర్కొన్నారు. కలెక్టరేట్ కార్యాలయం ఏవోకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ జరగలేదని, దీంతో ఆందోళన చెందుతున్నారు. రెండు లక్షలకు పైగా ఉన్న అప్పును చెల్లించాలని అధికారులు రైతులను ఒత్తిడి చేయడం సరైంది కాదన్నారు. వెంటనే రైతులందరికి ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని కోరారు. రవి, రమణరెడ్డి, రాజన్న, అజయ్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి రిఫరీగా విశాల

రామకృష్ణాపూర్, ఆగస్టు 27: హైదరాబాద్‌లో ఈ నెల 24,25 తేదీల్లో జరిగిన జాతీయ స్థాయి అత్యాపాత్య రిఫరీ క్లినిక్‌లో మందమర్రికి చెందిన పసుపునూటి విశాల ఏ గ్రేడ్‌లో ఉత్తీర్ణత సాధించిందని జిల్లా అధ్యక్షుడు కంబగోని సుదర్శన్‌ప్రధాన కార్యదర్శి దుర్గం రాజలింగులు తెలిపారు. జాతీయస్థాయిలో న్యాయ నిర్ణిత పోటీ పరీక్షలో ఏ గ్రేడ్ సాధించినందుకు విశాలను హ్యాండ్ బాల్ జిల్లా అధ్యక్షుడు గోనే శ్యాంసుందర్ రావు, ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేష్, జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి రఘునాథ్ రెడ్డి, రాజ్ వీర్, మందమర్రి పాఠశాల ప్రిన్సిపాల్ మంజుల, పిడిలు అభినందించారు.

పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

జన్నారం, ఆగస్టు 27: ప్రజ్ఞ వికాస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంచిర్యాల సెవెన్ హిల్స్ పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో స్లేట్ ఎక్సలెన్స్ స్కూల్ విద్యార్థిని రాగి అక్షిత ప్రథమస్థానంలో నిలిచింది. సెప్టెంబరు 2న జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని స్కూల్ చైర్మన్ ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ ఎం.శ్రీనివాస్

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 27: సోదర భావంతో ప్రశాంత వాతావరణంలో పండుగలను జరుపుకోవాలని సీపీ ఎం.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. ఈ యేడు వినాయక విగ్రహాల ఏర్పాటు పెరిగే అవకాశం ఉందన్నారు. వినాయక మండపాల నిర్వాహకులు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో అనుమతి తీసుకోవాలన్నారు. నమోదు చేసుకున్న వివరాల ఆధారంగా ఆన్‌లైన్ చేయడం, జీయో ట్యాగింగ్ చేస్తామన్నారు. నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంతరాలు జరగకుండా శోభాయాత్ర సాఫీగా సాగేలా రూట్ మ్యాప్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తామన్నారు. గణేష్ మండపాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, విద్యుత్ షార్ట్‌సర్క్యూట్, అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను నమ్మవద్దన్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే డయల్ 100 లేదా కమిషనరేట్ కంట్రోల్ రూమ్ 8712656597కు ఫోన్ చేయాలన్నారు. గణేష్ నిమజ్జనం, మిలాద్ ఉన్ నబీ ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. పెద్దపల్లి, మంచిర్యాల డీసీపీలు చేతన, ఏ.భాస్కర్, అడిషనల్ డీసీపీ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, ఏసీపీలు ఎం.రమేష్, జి.కృష్ణ, ఆర్.ప్రకాష్, ఏ.వెంకటేశ్వర్లు, రవికుమార్ పాల్గొన్నారు.

సాయికుంట చెరువు శిఖం భూమిని కాపాడాలి


వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ఏసీసీ, ఆగస్టు 27: కబ్జాకు గురైన సాయికుంట చెరువు శిఖం భూమిని కాపాడాలని విద్యార్థి సంఘాల నాయకులు అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ మంచిర్యాల పట్టణంలోని చెరువులు కబ్జాకు గురవుతున్నాయన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు రెవె న్యూ, నీటిపారుదల శాఖ అధికారుల సహకారంతో చెరువులను కబ్జా చేసి అక్రమ వెంచర్లు వేస్తున్నార న్నారు. సాయికుంట చెరువు సుందరీకరణ పనుల్లో భాగంగా చెరువు హద్దులను వదిలి కరకట్టలు పోయడం వల్ల రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అవకాశంగా మారిందన్నారు. ఎఫ్‌టీఎల్ ఏర్పాటు చేసిన అధికా రులు శిఖం భూమిని వదిలేశారన్నారు. కబ్జాకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. షేక్ సల్మాన్ పాషా, గోపాల్, చేరాల వంశీ, అఖిల్ పాల్గొన్నారు.

గంజాయిపై ఉక్కుపాదం మోపుతాం


మాట్లాడుతున్న ఏసీపీ రవికుమార్

బెల్లంపల్లి, ఆగస్టు 27: గంజాయిపై ఉక్కుపాదం మోపుతామని ఏసీపీ రవికుమార్ పేర్కొన్నారు. మంగళవారం బూడిదగడ్డ బస్తీలో వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్యతో కలిసి కార్డెన్‌సర్చ్ నిర్వహించారు. పలువురి ఇండ్లలో నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ ద్వారా తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 45 ద్విచక్రవాహనాలు, ఆటోను సీజ్ చేశారు. ఏసీపీ మాట్లాడుతూ ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. గంజాయి రవాణా చేసినా, సేవించినా చర్యలు తీసుకొంటామన్నారు. తల్లిదండ్రులు పిల్లలను గమనిస్తూ ఉండాలని సూచించారు. వాహనానికి సంబంధించిన అన్ని ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉండాలని, రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. పట్టణంలోని 20, 21, 22 వార్డుల్లో కార్డెన్ సర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేశారు. సీఐలు దేవయ్య, అఫ్జలుద్దీన్, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

భీమిని: గ్రామాల్లో నేరాల నియంత్రణకే తనిఖీలు నిర్వహిస్తున్నామని తాండూర్ సీఐ కుమారస్వామి పేర్కొన్నారు. రాంపూర్ గ్రామంలో తనిఖీలు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ప్రజల రక్షణే పోలీసుల ధ్యేయమని పేర్కొన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువులో రాణించాలన్నారు. లోన్ యాప్స్‌ను నమ్మి మోసపోవద్దన్నారు. ఎస్‌ఐ విజయ్‌కుమార్, కన్నెపల్లి ఎస్‌ఐ గంగారాం, పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: మహిళలు, బాలికల భద్రతకు పోలీసులు ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎస్‌ఐ సంతోష్, షీ టీం ఎస్‌ఐ షైమ అన్నారు. అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏఐఎస్‌బీ) ఆధ్వర్యంలో విశ్వశాంతి పాఠశాలలో అవగాహన సదస్సులో మాట్లాడారు. మహిళలు, బాలికలపై జరుగుతున్న అకృత్యాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. విద్యార్థినులకు ఏదైనా సమస్య తలెత్తితే 100 నెంబర్, షీ టీం 6303923700కు డయల్ చేయాలని సూచించారు. అనంతరం ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ఆత్మహత్యలు, డ్రగ్స్, సైబర్ నేరాలు, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కనుకుంట్ల సన్నీ గౌడ్, అనిల్ కుమార్, కుతుబ్, హెచ్‌ం జహేదా బేగం, కరస్పాండెంట్ రమేష్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కాసిపేట: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదువుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని దేవాపూర్ ఎస్‌ఐ అంజనేయులు అన్నారు. ధర్మారావుపేట జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి క్రమశిక్షణతో చదువుకుంటే ఉన్నత స్థాయికి చేరుతారన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. అనంతరం పాఠశాల డైరీని ఆవిష్కరించి విద్యార్థులకు అందించారు. విద్యార్థులు వారి దినచర్యను, హోంవర్కులను డైరీలో రాసుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు సుధాకర్‌నాయక్, ఉపాధ్యాయులు రాజేశం, శ్రీనివాస్, బాబ్జీ పాల్గొన్నారు.

భోజనంలో మెనూ పాటించాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

కెరమెరి, ఆగస్టు 27: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మెనూ ప్రకారం పోషక విలువలుకలిగిన నాణ్యమైన ఆహారాన్ని అందించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. కెరమెరి మండలంలోని మోడి కేజీబీవీ విద్యాలయాన్ని మంగళవారం ఆకస్మికంగా సందర్శించి భోజనశాల, నిత్యావసర సరుకులు, గోదాం, రిజిస్టర్‌లు, రికార్డులను పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన, పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని, నిర్ణయించిన మెనూ ప్రకారం భోజనం అందించాలని తెలిపారు. నాణ్యమైన సరుకులు, తాజా కూరగాయలను భోజనం తయారీకి వినియోగించాలని, విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. పాఠశాల సరిపరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సురక్షిత తాగునీరు అందించే విధంగా ఆర్‌ఓ ప్లాంట్ నిర్వహణ సక్రమంగా చూడాలని, ఆహారం తీసుకునే ముందు చేతులు శుభ్ర పర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, ఎంపీడీవో అంజద్‌పాషా, ఏఈ నజీముద్దీన్, కార్యదర్శి స్రవంతి, తదిత రులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకంలో మెనూ ప్రకారం భోజనం పెట్టాలని లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని అడిషనల్ కలెక్టర్ దాసరి వేణు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాల, గిరిజన సంక్షేమ బాలికల ఆదర్శ క్రీడా పాఠశాలలను ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని లేని పక్షంలో కఠిన చర్యలు తప్పవని పెర్కొన్నారు. బాలికల ఉన్నత పాఠశాలలో శ్రావణ మాసం సందర్భంగా విద్యార్థులకు కోడిగుడ్లు పెట్టకపోవడంపై నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధిగా మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. గిరిజన సంక్షేమ బాలికల ఆదర్శ క్రీడా పాఠశాలలో నెలకొన్న సమస్యలను విద్యార్థులు అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. బాత్‌రూంలలో నీటి సరఫరా సక్రమంగా రావడంలేదని, క్రీడా మైదానంలో వర్షం వచ్చినప్పుడు నీరు నిలిచి ఉండటంతో ఇబ్బందులకు గురవుతున్నట్లు అయన దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే మున్సిపల్ కమిషన్ భుజంగరావుకు ఫోన్‌ద్వారా పాఠశాలలో నెలకొన్న నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

వట్టివాగు కాలువలో పడి మహిళ మృతి

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 27: మండలంలోని బొందగూడ గ్రామానికి చెందిన మహిళ వట్టివాగు కాలువలో పడి మృతి చెందింది. గ్రామానికి చెందిన జాదవ్ సగ్రీబాయి, తన మూడేళ్ల కుమారుడు అశ్విన్‌ను సోమవారం సాయంత్రం బయటకు తీసుకెళ్లింది. ప్రమాదావశాత్తు వట్టివాగు కాలువలో పడిపోగా సగ్రీబాయి మృతి చెందినట్లు సీఐ సతీష్ తెలిపారు. అశ్విన్ ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. సగ్రీబాయి కొంత కాలంగా మతిస్థిమితం కోల్పోయిందన్నారు. మృతురాలి సోదరుడు సంతోష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

మట్కా ఆడిన ఒకరిపై కేసు

కాగజ్‌నగర్, ఆగస్టు 27: కాగజ్‌నగర్ నవ్‌గాం బస్తీలో మట్కా ఆడిన అజిల్‌ను అదుపులోకి తీసుకున్నట్టు టాస్క్‌పోర్సు సీఐ రాణా ప్రతాప్ తెలిపారు. తమకు ముందస్తు అందిన సమాచారం మేరకు నవ్‌గాం బస్తీలో మంగళవారం దాడులు చేయగా, ఆజిల్ వద్ద సెల్‌ఫోన్, చిట్టీలు లభించినట్టు తెలిపారు. ఈ దాడులో ఎస్సై వెంకటేష్, పీసీలు మధు, రమేష్ పాల్గొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన


డిపో గేటు ఎదుట నిరసన తెలయజేస్తున్న ఆర్టీసీ కార్మికులు

ఆసిఫాబాద్, ఆగస్టు 27: ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని రాష్ట్ర ఆర్టీసీ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం ఆసిఫాబాద్ డిపో ఆవరణలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు నల్లబ్యాడ్జీలు నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామి మేరకు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, బాండ్ల డబ్బులను వెంటనే చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న పీఆర్సీలను, డీఏను వెటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఉపేందర్, దివాకర్, జాక్, మోహన్‌బాబు, లక్ష్మణ్, ఎజాజ్, అశోక్, భారతి, గోవిందు, తులసీరాం, రవి, డేవిడ్, రమేష్, గోపి, సురేష్, సులేమాన్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

వీవోఏలు తరలిరావాలి

లింగాపూర్ 27: చలో కలెక్టరేట్ కార్యక్రమానిని వీవోఏలు తరలిరావాలని సంఘం మండల అధ్యక్షుడు సలా హనుమంతరావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. వీవోఏలు ఏదుర్కొం టున్న సమస్యల పరిష్క రించాలని బుధవారం చలో కలెక్టరేట్ కార్యక్రం చేపట్టామని, సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని తెలిపారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

ఆసిఫాబాద్, ఆగస్టు 27: జిల్లా కేంద్రంలోని వాసవి హైస్కూల్‌లో మంగళవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సిర్పూర్(యు): మండలంలో ప్రజలు శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని హనుమాన్-సాయిబాబా ఆలయంలో పాటు మహాదేవ్ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావు, కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ చైర్మన్ కుడ్మేత విశ్వనాధ్‌రావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పూజలు

చింతలమానేపల్లి, ఆగస్టు 27: చింతలమానేపల్లి మండలంలోని కర్జవెల్లి గ్రామంలోని ఓంకార ఆశ్రమం రాధాకృష్ణ మందిరంలో మంగళవారం ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆహ్లాదకర వాతావరణంలో ఇక్కడ మందిరం నిర్మించడంతో మండలంలో ప్రశాంత వాతావరణం నెలకొందని ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఆయన వెంట నాయకులు మల్లయ్య, శ్రీశైలం, నానయ్య, రంగయ్య, సాయి, ఎర్రయ్య, రుషీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అఖండ భజన

కాగజ్‌నగర్, ఆగస్టు 27: కాగజ్‌నగర్ పట్టణంలోని శ్రీ కన్యాకపరమేశ్వరి ఆలయంలో అఖండ భజన కార్యక్రమం మంగళవారం ముగిసింది. గోకులాష్టమిని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శంకరయ్యతో పాటు భజన కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు రుణమాఫీ వర్తింపజేస్తాం

సిర్పూర్(టి), ఆగస్టు 27: అర్హులైన ప్రతి ఒక్కరికీ తప్పకుండా రుణమాఫీ వర్తిస్తుందని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెల్లరేషన్ కార్డు లేని రైతులు తమ కుటుంబ సభ్యుల వివరాలు, ఆధార్ కార్డులు ఏఈఓలకు అందజేయాల న్నారు. రెండు లక్షల పై బడిన రుణాలు ఉన్న వారికి రుణ మాఫీ వర్తిస్తుందన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ మధులత, ఏఈఓలు కవిత, రవికుమార్, శోభ, నేహాతబసుం తదితరులు పాల్గొన్నారు.

దహెగాం: మండల కేంద్రంలోని రైతు వేదికలో రుణ మాఫీపై రైతుల నుంచి రుణ మాఫీ నోడల్ అధికారి మనోహర్ ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా రైతులకు రుణ మాఫీపై ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. రుణ మాఫీ కాని రైతులు వారి ఫిర్యాదు లను అందజేశారు. రైతులు, సంయమనం పాటించాలని, అర్హులైన వారికి రుణ మాఫీ అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈ వోలు ఆనంద్‌రావు, దీపక్, వంశీ, సుస్మిత, లావణ్య, రోహిణి, సీఈఓ బక్కయ్య పాల్గొన్నారు.

అక్రమంగా ఆవులను తరలిస్తున్న లారీ పట్టివేత

తిమ్మాపూర్, ఆగస్టు 27: అక్రమంగా ఆవులను తరలిస్తున్న ఓ లారీని తిమ్మాపూర్ మండలంలోని రేణికుంట టోల్ ప్లాజా వద్ద పోలీసులు మంగళవారం తెల్లవారు జామున పట్టుకున్నారు. ఎల్‌ఎండీ ఎస్సై చేరాలు తెలిపిన వివరాల ప్రకారం.. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా, వాంకిడి మండలం గోరెగావ్ నుంచి హైదారాబాద్‌కు ఆవులను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో పోలీసులు టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఎంహెచ్ 34 బీజీ 8497 నంబర్ లారీని తనిఖీ చేయగా అందులో ఆవులు కనిపించాయి. వాటిని అక్రమంగా తరలిస్తున్నా రని గుర్తించి లారీని స్వాధీనం చేసుకుని ఆవులను ఎల్‌ఎండీలోని గోశాలకు తరలించారు. లారీలో 48 ఆవులు ఉండగా ఊపిరి ఆడక ఆరు వాహనంలోనే మృతి చెందాయి. చాలా ఆవులు అస్వస్థతకు గురయ్యాయి. పోలీసులు పశు వైద్యశాఖ సిబ్బందిని పిలిపించి చికిత్స అందించారు. చనిపోయిన ఆవులకు పోస్టుమార్టం నిర్వహించారు. ఆవులను అక్రమంగా తరలిస్తున్న ఇమ్రాన్, సోహైల్, షాహిద్, తుకారాం, లారీ డ్రైవర్ ఫయాజ్‌అలీపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చేరాలు తెలిపారు.

ఉన్నత చదువుకు ఆర్థిక సహాయం

సిర్పూర్(యు/జైనూర్, ఆగస్టు 27:మండలంలోని పుల్లర గ్రామానికి చెందిన ఆదివాసీ విద్యార్థి కృష్ణకు ఆర్థిక సాయం అందజేశారు. కృష్ణ ఐఐటీలో సీటు పొందాడు. కృష్ణ కటుంబీకులు పేద వారు కావడంతో అడ్మిషన్ కోసం ఇబ్బందులు పడుతున్న విషయాన్ని పత్రికలలో ప్రచురించారు. దీంతో ఆదివాసీ మహిళ ట్రైబల్ రాణి దుర్గవతి సొసైటీ సభ్యులు మంగళవారం పుల్లర గ్రామాన్ని సందర్శించి ఆదివాసీ విద్యార్థి కృష్ణతోపాటు కుటుంబా సభ్యులను సన్మానించారు.ఈ సందర్భంగా మహిల సంఘ అధ్యక్షురాలు గోడం జంగుబాయి మాట్లాడుతూ ఆదివాసీ విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలని కోరారు. యువత చదువుపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో మహిళా సంఘం సభ్యులు ఆత్రం ఏతిమా, కుడ్మేత చందుబాయి, ఆడ సుందరబాయి,ఆర్క రంభబాయి,ఆత్రం తూలసిబాయి తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో వైద్య శిబిరం

వాంకిడి, ఆగస్టు 27: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. జ్వరంతో ఉన్న ఇద్దరు విద్యార్థినుల నుంచి రక్తన మునాలు సేకరించి రక్తహీనత అనుమానిత నలుగురు విద్యార్థులను ప్రభుత్వ వైద్యశాలకు పంపించారు. 81 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఈఓ రవిదాస్, హెచ్‌ఎస్ అనసూయ, సిబ్బంది మమత, రుక్మిణి, జీవిత, శారద తదితరులు పాల్గొన్నారు.

వీవోఏల మండల కార్యవర్గం

బెజ్జూరు, ఆగస్టు 27: వీవోఏల మండల కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సంతోష్, కార్యదర్శిగా సుజాత, ఉపాధ్యక్షులుగా శ్యాంసుందర్, సహాయ కార్యదర్శిగా కేశవ్, కోశాధికారిగా జయసుధ, గౌరవ అధ్యక్షుడిగా విలాస్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు కృష్ణమాచారి పాల్గొన్నారు.

తండాల్లో తీజ్ సంబరాలు


లింగాపూర్‌లో గోధుమ బుట్టలతో వెళుతున్న యువతులు

లింగాపూర్ 27: మండల కేంద్రంతోపాటు పిక్లాతండా, మోతిపట్టార్, వంకామద్ది, పూల్‌సింగ్ తండా, కిమానాయక్‌తండా, రామునా యక్‌తండా, గోపాల్‌పూర్, సితారాంనాయ క్‌తం డాల్లో మంగళవారం తీజ్ సంబరాలు నిర్వహిం చారు. తొమ్మిది రోజులు నాలుగు దశలుగా పం డుగను నిర్వహించారు. యువతులు, మహిళలు గోధుమ బుట్టలతో నిర్వహించిన ఊరేగింపు ఆకట్టుకుంది. కార్యక్రమాల్లో గ్రామనాయక్‌లు తదితరులు పాల్గొన్నారు.

కబ్జాలను అడ్డుకోవాలి


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కాగజ్‌నగర్, ఆగస్టు 27: కాగజ్‌నగర్ మున్సిపాల్టీలో పలు వార్డుల్లోని ప్రధాన కాల్వపై కబ్జాలు చేపడుతున్నారని, అధికారులు అడ్డుకోవాలని స్థానిక నాయకుడు యూనస్ మున్సిపల్ కమిషనర్ అంజ య్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలో కబ్జాలకు గురైన స్థలాలపై విచారణ చేపట్టాలని కోరారు. అక్రమార్కులపై కఠినంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆయా వార్డులకు చెందిన యువకులు పాల్గొన్నారు.



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

సిర్పూర్(టి), ఆగస్టు 27: సిర్పూర్(టి) మండల కేంద్రంలో ఆటో డ్రైవర్లకు మంగళవారం ఎస్సై కమలాకర్ ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వాహన నిబంధనలు పాటించాలన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా వాహనాలు నడపాలని, అలాగే పరిమితికి మించి ప్రయాణికులను చేరవేయకూడదని చెప్పారు., సురక్షితంగా ప్రయాణీలను వారి గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. ప్రతి ఒక్కరూ వాహన పత్రాలు, లైసెన్సులు కలిగి ఉండాలని, మద్యం తాగి వాహనాలు నడపకూడని తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ బంద్ ప్రశాంతం



జైనూర్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆదివాసీలు

జైనూర్, ఆగస్టు27: జిల్లా వ్యాప్తంగా ఏజెన్సీ బంద్ మంగళవారం ప్రశాంతంగా ముగిసింది. జైనూర్ మండల కేంద్రంలో మంగళవారం ఆదివాసీల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా దుకాణాలు స్వచ్ఛందంగా మూసివేశారు. ఆదివాసీలు ప్రధాన రోడ్డుమీదుగా ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ తిరుపతికి డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కనక యాదవ్‌రావ్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి ఆదివాసీలు ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపట్టినా పాలకులకు పట్టింపు లేదన్నారు. సమస్యలు పరిష్కరించక పోవడంతో మరో ఉద్యమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ ఉమ్మడి ఆదివాసీ సంఘాల పిలుపు మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చేపట్టిన ఏజెన్సీ బంద్ విజయవంతమైందని తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు కుంర భగ్వంత్‌రావ్, మేస్రాం అంబాజీ, సోయం గున్వంత్‌రావ్, గేడాం గనపత్‌రావ్, కోట్నాక దౌలత్‌రావ్, కనక రాంజీ, కుంర దుందేరావ్, ఉర్వేత జంగుబ, కుంర దేవశావ్ పాల్గొన్నారు.

సిర్పూర్(యు): ఏజెన్సీ ప్రాంతంల్లో మంగళవారం ఆదివాసీ సంఘల అధ్వర్యంలో నిర్వహించిన ఏజెన్సీ బంద్ మండలంలో సంపూర్ణంగా జరిగింది. .ఈ సందర్భంగా ఆదివాసీ సంఘల నాయకులు మాట్లాడుతూ తమ డిమాండ్లు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు.

తిర్యాణి: ఆదివాసీ హక్కులను పరిరక్షించాలంటూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో తలపెట్టిన ఏజెన్సీ బంద్ తిర్యాణి మండలంలో సంపూర్ణంగా కొనసాగింది. ఉదయం నుంచే మండల కేంద్రంలో దుకాణ సముదాయాలు, విద్యాసంస్థలు తెర్చుకోలేదు. ఈ సందర్భంగా కుమరం భీం చౌరస్తాలో తుడుందెబ్బ, ఆదివాసీ నాయకులు రాస్తారోకో చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, గుణవంతరావు, భగవంతరావు, భాస్కర్, సుభాష్, గపతి, సోనేరావు, అర్జు తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి: ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలని తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఇచ్చిన ఏజెన్సీ బంద్ వాంకిడిలో సంపూర్ణంగా జరిగింది. ఉదయం నుంచే ఆదివాసీ సంఘాల నాయకులు దుకాణాలు,హోటళ్లు, కిరాణ దుకాణాలు, పాన్ టేలాలను మూయించి వేవారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయినాథ్, శ్రీనివాస్, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూరు: మండల కేంద్రంలో మంగళవారం తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఏజెన్సీబంద్ ప్రశాంతంగా నిర్వహించారు. వ్యాపార సంస్థ తుడుందెబ్బ నాయకులు బంద్ చేయించారు. కార్యక్రమంలో శంకర్, తిరుపతి, వెంకటేష్, రమేష్ పాల్గొన్నారు. ఎస్సై విక్రం ఆధ్వర్యంలో బందో బస్తు ఏర్పాటు చేశారు.

కెరమెరి: ఆదివాసీ హక్కుల సాధన కోసం మంగళవారం తుడుందెబ్బ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏజెన్సీ బంద్ సంపూర్ణం అయింది. ఆదివాసీ సంగాల పిలుపుతో హుటళ్లు, కిరాణ దుకాణాలు, పాన్ షాప్‌లు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

దహెగాం: మండల కేంద్రంలో మంగళవారం తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఏజెన్సీబంద్ నిర్వహించారు. వ్యాపార సంస్థలను తుడుందెబ్బ నాయకులు బంద్ చేయించారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, మధుకర్,లచ్చిరాం, శ్రీనివాస్, మహేష్,గురుదదాస్, భీమయ్య, సురేఖ, సావిత్రిబాయి, నాగుబాయి, తదితరులు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి: మండల కేంద్రంలో ఆదివాసీ, తుడుందెబ్బ ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ మంగళవారం ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా మండలంలో ఉన్న దుకాణ సముదాయాలు మూసి వేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ నాయకుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏజెన్సీలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేవారు. అనంతరం ఎంపీడీవో ప్రసాద్, తహసీల్దార్ కార్యాలయంలో గిర్దావర్ జాఫర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నీలయ్య, ప్రసాద్, కె.ప్రసాద్, కిష్టయ్య, హనుమంతు, ఫణిందర్ తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: మండల కేంద్రంలో ఆదివాసీ, తుడుందెబ్బ ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ మంగళవారం ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా మండలంలో ఉన్న దుకాణ సముదాయాలు మూసి వేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ నాయకుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఏజెన్సీలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాంతయ్య, మాపు, సురేష్, రాజు, సత్తయ్య ఎస్.బాపు, అశోక్, సత్తన్న, తదితరులు పాల్గొన్నారు.

పెంచికలపేట: మండల కేంద్రంలో ఆదివాసీ, తుడుందెబ్బ ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ మంగళవారం ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా మండలంలోని జిల్లెడ, మురళీగూడ గ్రామాల్లో ధర్నాచేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



కౌటాలలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీ నాయకులు

తెప్పలపైనే ప్రయాణం

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 27: ప్రమాదమని తెలిసినప్పటికిని గుండి వాసులు తెప్పల పైననే ప్రయాణం చేస్తూ వాగును దాటుతున్నారు. యేటా వర్షకాలంలో గుండి వాసుల కష్టలు తప్పడంలేదు. గుండి వాగుపై వంతెన నిర్మాణపనులు కొనసాగుతుండడంతో జిల్లా కేంద్రానికి రావాలంటే ఈ సహస ప్రయాణం చేయాల్సిందే. ఆసిఫాబాద్ పట్టణానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న గుండి గ్రామం నుండి నిత్యం పాఠశాలలకు, కళాశాలలకు విద్యార్థులు, నిత్యవసరాల కోసం గ్రామస్థులు రాకపోకలు సాగిస్తుంటారు. వర్షకాలంలో వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో తెప్పలపైననే ప్రయాణం చేస్తున్నారు. ఇదే అదనుగా తీసుకొని తెప్పలపై వాగును దాటించేందుకు స్థానిక గజ ఈతగాళ్ళు ఒక్కొక్కరి వద్ద నుంచి అందిన కాడికి దండుకుంటున్నారు. వాగు నుంచి జిల్లా కేంద్రానికి రావాలంటే ఆటోకు అదనంగా మరో కొంత చెల్లించాల్సిందే. నాలుగు కిలో మీటర్ల విడిదికి రానుపోను రూ. 80 నుంచి రూ. 100 ఖర్చు చేయాల్సి వస్తుందని గ్రామస్థులు వాపోతున్నారు. ఇక వాగు ఉగ్రరూపం దాలిస్తే వాంకిడి మండలంలోని ఖనర్‌గాం, ఖమాన మీదుగా జిల్లా కేంద్రానికి చేరుకోవాలంటే 25 కిలో మీటర్ల దూరానికి రానుపోను రూ. 200 వెచ్చించాల్సి వస్తోంది. అధికారులు వంతెన పనులను పూర్తి చేయాలని కోరుతున్నారు.



తెప్ప మీద వెళ్తున్న గుండి గ్రామ ప్రజలు



కరుణ చూపండి..

క్రమబద్ధీకరించండి

- ఆశల పల్లకిలో ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు
- ఏళ్లుగా సేవలు చేస్తున్నా పర్మినెంట్ ఊసు కరువు
- నెలనెలా అందని వేతనాలు
- కుటుంబాల పోషణకు అవస్థలు

ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థానంలో నిలువాలనుకుని వచ్చిన అవకాశం వదలకూడదని గ్రామ కార్యదర్శి ఉద్యోగంలో చేరారు. వారిపై పని భారం పెరిగినా భరిస్తూ వస్తున్నారు. ఏళ్లుగా పని చేస్తున్నా ఉద్యోగం క్రమబద్ధీకరణ జరుగక పోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 27: గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ (ఓపీఎస్) పంచాయతీ కార్యదర్శులకు భరోసా కరువైంది. 2017లో ప్రభుత్వం విడుదల చేసిన జూనియర్ పంచాయతీ కార్యదర్శి భర్తీ నోటిఫికేషన్ ద్వారా పంచాయతీ కార్యదర్శులు పరీక్ష రాసి మెరిట్, రోస్టర్ పాయింట్ల ద్వారా ఎంపికయ్యారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో జేపీఎస్‌లతో సమానంగా విధులు నిర్వహిస్తున్నారు. వీరికి రూ. 10,600 నుంచి రూ. 15వేల వరకు వేతనం మాత్రమే అందిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే అరకొర వేతనం మూడు నెలలకోసారి ఇస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

జిల్లాలో 57 మంది..

జిల్లాలో ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు 57 మంది పని చేస్తున్నారు. కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఖాళీగా ఉన్న పంచా యతీ కార్యదర్శి పోస్టులను జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా ప్రభుత్వం భర్తీ చేసింది. కాగా ఉద్యోగంలో పని ఒత్తిడి, ఉన్నతాధికారుల వేధింపులు తట్టుకోలేక కొందరు, వేరే ఉద్యోగాలు రావడంతో మరికొందరు తమ ఉద్యోగాలకు రాజీనామా చేశారు. ఇలా వెళ్లిపోయిన వారి స్థానంలో పరీక్ష రాసిన వారిలో మెరిట్, రోస్టర్ పాయింట్ల ద్వారా ఔట్‌సోర్సింగ్ కార్యదర్శులుగా నియమించారు. ఔట్‌సోర్సింగ్‌లో పని చేస్తున్న కార్యదర్శులను ప్రభుత్వం ఇటీవల కొన్ని జిల్లాల్లో జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా కన్వర్షన్ చేశారు.

జేపీఎస్‌లుగా క్రమబద్ధీకరించాలి..

తన్నీరు వెంకటేష్, ఓపీఎస్, సరండి



ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను జేపీఎస్‌లుగా క్రమబద్ధీకరించాలి. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో జేపీఎస్‌లతో సమానంగా పని చేస్తున్నాం. ఉద్యోగ భద్రత లేక ఇబ్బందులు పడుతూ విధులు నిర్వహిస్తున్నాం. ఇప్పటికే సీఎం, మంత్రులతో పాటు అధికారులను కలిసి వినతి పత్రాలను అందజేశాం. ఔట్ సోర్సింగ్ కార్యదర్శులుగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా నియమించాలి.

వేతనాల్లో భారీ తేడా..

ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులకు వేతనాల్లో భారీ తేడా ఉంది. జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు ప్రభుత్వం రూ. 28,719 వేతనం అందిస్తోంది. ఔట్ సోర్సింగ్ వారికి కేవలం రూ. 10,600 అందిస్తున్నారు. వేతనాలు కూడా జిల్లాకో తీరుగా ఉన్నాయి. కొన్ని జిల్లాల్లో అత్యధికంగా రూ. 15వేలు చెల్లిస్తున్నారు. కాగా మరి కొన్ని జిల్లాల్లో రూ. 10,600, రూ. 12,500 చొప్పున ఔట్ సోర్సింగ్ ఏజేన్సీలు చెల్లిస్తున్నాయి. అవి కూడా రెండు, మూడు నెలలకోసారి ఇస్తున్న పరిస్థితి ఉందని అవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు మరణిస్తే ప్రభుత్వం నుంచి అందించే ప్రయోజనాలు అందడం లేదు. కొందరు ప్రమాదాల బారిన పడి, మరి కొందరు పని ఒత్తిడి ఇతరత్రా కారణాలతో మరణిస్తే ఎలాంటి ప్రయోజనంఉండడం లేదు. ఔట్ సోర్సింగ్ ఎత్తివేసి క్రమబద్ధీకరించాలని కోరుతున్నారు.



వాంకిడిలో గ్రామ పంచాయతీ కార్యాలయం

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధవహించాలి

వాంకిడి, ఆగస్టు 27: విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. వాంకిడి మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వంటశాల, సరుకుల నిలువలు, రిజిస్టర్లు, తరగతి గదులు, విద్యార్థినులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా పూర్తి స్థాయి సదుపాయాలతో నాణ్యమైన విద్యను అందించేందుకు అన్ని ప్రభుత్వ పాఠశాలలో అభివృద్ధి, మరమ్మతు పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. ప్రతి పాఠశాలలో తాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, సౌచాలయాలు ఇతర అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఈక్రమంలో పారిశుద్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ పాఠశాల తరగతి గదులు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. వార్షిక పరీక్షలలో ఉన్నతమైన ఉత్తీర్ణత సాధించే విధంగా కార్యచరణ ప్రకారం విద్యార్థులకు పాఠ్యాంశాల బోధన చేయాలని, తరగతిలో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఉపాధ్యాయులు, సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

ఆసిఫాబాద్, ఆగస్టు 27: తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారుడిగా విధులు నిర్వహిస్తూ మృతి చెందిన గోలేటి మారుతి కుటుంబ సభ్యులకు సంస్థ ద్వారా మంజూరైన రూ.5.36 లక్షల చెక్కును మంగళవారం కలెక్టరేట్ చాంబర్‌లో మారుతి భార్య శారద, కూతురు అనూషలకు కలెక్టర్ వెంకటేష్ దోత్రే అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలను కళాజాతా ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు ప్రముఖ పాత్ర పోషస్తారని అన్నారు. మారుతి సారధి కళాకారుడిగా విధులు నిర్వహిస్తూ గత సంవత్సరం అనారోగ్యంతో మృతి చెందగా తెలంగాణ సాంస్కృతిక సారధి సంస్థ వారిచే చెక్కు మంజూరైందన్నారు. ఈ మేరకు కుటుంబ సభ్యులకు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈపీఆర్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జీఎం దీక్షితులు

శ్రీరాంపూర్, ఆగస్టు 27: ఈపీఆర్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని కార్పొరేట్ జీఎం(పర్సనల్) దీక్షితులు అన్నారు. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్, ఎస్‌టీపీపీ ఏరియాలకు చెందిన పర్సనల్ విభాగం అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు చెందిన ఎంప్లాయీ పర్సనల్ రికార్డు(ఈపీఆర్)ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ వారికి అందవలసిన ఫలాలను అందించాలన్నారు. ఉద్యోగులు ఉద్యోగ విరమణ తరువాత పొందవలసిన అన్ని బెనిఫిట్స్‌ను నిబంధనల ప్రకారం అందించాలని సూచించారు. కాంట్రాక్టు ఉద్యోగుల హాజరును ఆన్‌లైన్‌లో నమోదు చేస్తూ గైర్హాజరైతే కౌన్సెలింగ్ ద్వారా వారిని విధులకు హాజరయ్యేలా చూడాలన్నారు. కోర్టులు, ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న కేసులు, దరఖాస్తులపై ఆయన వివరాలు తెలుసుకున్నారు. ఈ నెలాఖరులోగా ఉద్యోగ విరమణ పొందనున్న దీక్షితులును పర్సనల్ విభాగం సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ డీజీఎం(పర్సనల్) అరవిందరావు, మందమర్రి పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, బెల్లంపల్లి పర్సనల్ మేనేజర్ తిరుపతి, ఎస్‌టీపీపీ సంక్షేమాధికారి మోహన్‌సింగ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం

కాసిపేట, ఆగస్టు 27: కాసిపేట 1వ గనిలో రక్షణాధికారిగా పనిచేస్తున్న సునీల్ రామగుండం అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్టుకు బదిలీ అయిన నేపధ్యంలో మంగళవారం కాసిపేట 1వ గనిపై కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు, అధికారులు సునీల్‌ను గజమాలతో ఘనంగా సన్మానించారు. రక్షణాధికారిగా సునీల్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గని మేనేజర్ భూశంకరయ్య, ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, బెల్లంపల్లి ఇన్‌చార్జీ చిప్ప నర్సయ్య, పిట్ కార్యదర్శి మీనుగు లక్ష్మీనారాయణ, టీబీజీకేఎస్ నాయకులు ఒడ్నాల రాజన్న, బన్న లక్ష్మణ్‌దాస్, ఐఎన్‌టీయూసీ నాయకులు రాజ్‌కుమార్, శివ, రాజేశం, హెచ్ఎంఎస్ నాయకులు థామస్, సీఐటీయూ నాయకులు తిరుపతి, శ్రీధర్, ఎస్సీ, ఎస్టీ నాయకులు కృష్ణ, శ్రీనివాస్, రవి, డిప్యూటి మేనేజర్ నిఖిల్, అండర్ మేనేజర్ దిలీప్, ఇంజనీర్ మదుకర్, ఖాన్‌మీర్జా తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌కే-7 గని మేనేజర్‌కు సన్మానం

శ్రీరాంపూర్, ఆగస్టు 27: ఆర్‌కే-7 గనికి నూతన మేనేజర్‌గా వచ్చిన తిరుపతిని ఏఐటీయూసీ నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. అనంతరం పిట్ కమిటీని పరిచయం చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్ రావు, ఏరియా కార్యదర్శి సారయ్య, పిట్ కార్యదర్శి రవీందర్, సహాయ కార్యదర్శి ప్రతాప్ పాల్గొన్నారు.

స్కౌట్‌తో క్రమశిక్షణ

మందమర్రి టౌన్, ఆగస్టు 27: స్కౌట్ అండ్ గైడ్స్ దేశ భక్తిని, క్రమశిక్షణను పెంపొందించడానికి దోహదపడుతుందని జీఎం దేవేందర్ అన్నారు. మంగళవారం స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో తృతీయ సోపాన్ టెస్టింగ్ ఫర్ గైడ్స్ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు స్కౌట్ నేర్చుకోవడం అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌వో టూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం, సెక్యూరిటీ ఆఫీసర్ రవి, స్టేట్ ఆర్గనైజింగ్ కమీషనర్ ఫర్ గైడ్స్ ప్రమోదిని, ఎన్ భరతమాత, నిరంజన్, అమరజ్యోతి, శక్తికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంస్థ ఆస్తులను పరిరక్షించాలి

శ్రీరాంపూర్, ఆగస్టు 27: సంస్థ ఆస్తుల పరిరక్షణలో రక్షణ విభాగం సిబ్బంది కృషి అభినందనీయమని కార్పొరేట్ జీఎం(పర్సనల్, రక్షణ) దీక్షితులు పేర్కొన్నారు. సీసీసీలోని సింగరేణి గెస్ట్‌హౌస్‌లో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గనులు, విభాగాల్లో దొంగతనాల నిర్మూలనకు సిబ్బంది పాటుపడుతున్నట్లు చెప్పారు. ఇతర విధుల్లోనూ వారు చాలా బాగా పనిచేస్తున్నట్లు అభిప్రాయపడ్డారు. కాగా కార్పొరేట్ జీఎం(పర్సనల్, రక్షణ) దీక్షితులు, బెల్లంపల్లి ఏరియా సెక్యూరిటీ అధిఅరి వరప్రసాద్ రిటైర్ అవుతున్న సందర్భంగా వారిద్దరిని శ్రీరాంపూర్ ఏరియా ఇన్‌చార్జి జీఎం టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓ టు జీఎం ఎస్. సత్యనారాయణ, డీజీఎం(పర్సనల్) పి. అరవిందరావు, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి, కార్పొరేట్ డీజీఎం (రక్షణ) వేణుమాధవ్, ఎస్ఎస్‌ఓ మురళీమోహన్, సీనియర్, జూనియర్ ఇన్‌స్పెక్టర్లు, జమేదార్లు పాల్గొన్నారు.

మ్యాన్ రైడింగ్ సిస్టం తనిఖీ

కాసిపేట, ఆగస్టు 27 : కాసిపేట 2 గనిలో ఏర్పాటు చేస్తున్న మ్యాన్ రైడింగ్ సిస్టం పనులను మంగళవారం డిప్యూటి డైరెక్టర్ ఆఫ్ మైన్స్ అధికారి దిలీప్‌కుమార్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కాసిపేట 2వ గనిలో కొనసాగుతున్న మ్యాన్ రైడింగ్ సిస్టం పనులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. రక్షణతో కూడిన ఉత్పత్తిని చేయాలని సూచించారు. గని రికార్డులు, మ్యాప్‌లను పరిశీలించారు. ఆయన వెంట కేకే గ్రూపు ఏజెంటు రాందాస్, ఏరియా ఇంజనీర్ వెంకటరమణ, ఏజీఎం రామనాధం, గని మేనేజర్ లక్ష్మీనారాయణ, గ్రూపు ఇంజనీర్ రాం ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఆదర్శంగా నిలుస్తున్న ఎస్టీపీపీ

జైపూర్, ఆగస్టు 27: దేశంలోనే విద్యుత్ కేంద్రాలకు జైపూర్ ఎస్టీపీపీ ప్లాంట్ ఆదర్శంగా నిలుస్తుందని డిప్యూటి సెక్రటరీ మినిస్ట్రీ ఆఫ్ కోల్ డైరెక్టర్ దర్శన్‌కుమార్ సోలంకి అన్నారు. జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. ఎస్టీపీపీ ఈడీ రాజశేఖర్‌రావు ప్లాంట్ పనితీరును ఆయనకు వివరించారు. సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ దేశంలోనే థర్మల్ పవర్ ప్లాంట్లలో మెరుగైన పీఎల్ ఎఫ్ సాధిస్తూ అగ్రగామిగా నిలుస్తుందన్నారు. అన్ని రకాల పర్యావరణ నియమాలు పాటిస్తున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఎఫ్‌జీడీ ప్లాంట్‌ను నిర్మిస్తున్నామని ఆయనకు వివరించారు. ఎస్‌సీసీఎల్ డైరెక్టర్ దర్శన్‌కుమార్ సోలంకి మాట్లాడుతూ ప్లాంటు పనితీరు అద్భుతంగా ఉందన్నారు. ఎఫ్‌జీడీ పనులను పరిశీలించారు. అనంతరం సోలార్ పవర్ ప్లాంటు పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీపీపీ అధికారులు శ్రీనివాసులు, జెఏన్ సింగ్, రమణ, చంద్రమణి, ప్రభాకర్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



జైపూర్ పవర్ ప్లాంటును పరిశీలిస్తున్న దర్శన్‌కుమార్ సోలంకి



సింగరేణిలో తిరిగి ఎన్నికలు నిర్వహించాలి



మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

మందమర్రిటౌన్, ఆగస్టు 27: సింగరేణిలో కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికలు తిరిగి మళ్లీ నిర్వహించాలని టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. భూపాలపల్లి ఏరియాలో నిర్వహించిన కేంద్ర కమిటీ సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. కార్మిక సంఘం ఎన్నికలు జరిగి 8 నెలలు కావస్తున్నా గెలిచిన సంఘానికి గుర్తింపు పత్రం ఇవ్వలేదన్నారు. గెలిచిన తర్వాత 45 రోజులకే పత్రం ఇవ్వాల్సి ఉండగా ఇంత వరకు ఇవ్వనందున నిబంధనల ప్రకారం మళ్లీ ఎన్నికలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మాదాసు రామ్మూర్తి, రాజశేఖర్, కొమురయ్య, సురేందర్‌రెడ్డి, మేడిపల్లి సంపత్, జె రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

గెలిచిన సంఘానికి గుర్తింపు పత్రం ఇవ్వాలి



గని మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

మందమర్రిటౌన్, ఆగస్టు 27: సింగరేణిలో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, గెలిచిన కార్మిక సంఘానికి గుర్తింపు పత్రం ఇవ్వాలని మంగళవారం సీఐటీయూ నాయకులు కేకే 5 గని మేనేజర్ ప్రవీణ్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. బ్రాంచ్ కార్యదర్శి వెంకటస్వామి, అల్లి రాజేందర్‌లు మాట్లాడుతూ సింగరేణిలో ఎన్నికలు జరిగి 8 నెలలు కావస్తున్నా గెలిచిన సంఘానికి గుర్తింపు పత్రం ఇవ్వకపోవడం ఏంటని మండిపడ్డారు. వెంటనే గుర్తింపు పత్రం అందించాలని, అలాగే కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. లాభాల వాటా చెల్లించాలని, సీఎంపీఎఫ్ చిట్టీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తమ యూనియన్ పోరాటాలు చేస్తుందని తెలిపారు. సమావేశంలో నాయకులు రామస్వామి, వంశీ, శ్రీనివాస్, రాంబాబు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

లాభాల వాటాను వెంటనే చెల్లించాలి

శ్రీరాంపూర్, ఆగస్టు 27: సింగరేణి ఉద్యోగులకు లాభాల వాటాను వెంటనే చెల్లించాలని సీఐటీయూ ఏరియా కోశాధికారి కస్తూరి చంద్రశేఖర్ అన్నారు. సింగరేణి వ్యాప్త ఆందోళనల్లో భాగంగా మంగళవారం ఆయన ఆర్‌కే-న్యూటెక్, ఆర్‌కే-5 గనులపై పర్యటించి బుధవారం జీఎం కార్యాలయం ఎదుట చేపట్టే ధర్నాకు రావాలని కార్మికులను కోరారు. అనంతరం మాట్లాడుతూ, ఇప్పటికే 20వ తేదీ నుంచి 24వ తేదీ వరకు సంతకాల సేకరణ చేపట్టామని, 26న అన్ని గనులు, విభాగాలలో సమర్పించామని, 28న జీఎం కార్యాలయాల ఎదుట ధర్నా చేపడతామన్నారు. తెలంగాణలోని అన్ని బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించాలని, కార్మికులకు లాభాల వాటా చెల్లించాలని, సొంతింటి కల నెరవేర్చాలని, పెర్క్స్‌పై ఆదాయపు పన్ను మినహాయించాలని, మారుపేర్లను సరి చేయాలని డిమాండ్ చేశారు.